క్లుప్తంగా

అమ్మఒడి లబ్ధిదారుల సంబరాలు



మహిళలతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అమ్మఒడి లబ్ధిదారులు సంబరాలు చేసుకున్నారు. వరుసగా నాలుగో ఏడాది కుడా అమ్మ ఒడి సొమ్ము జమ చేసినందుకు కృతజ్ఞతగా వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎం జగన్ మేలు మరువలేమన్నారు. భవిష్యత్తులో ఆయనకు అండగా ఉంటామని మహిళలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయరెడ్డి, వడ్డే వెంకటేష్, ఆదిమల్లు, ధనంజయరెడ్డి, పాలాక్షిరెడ్డి, రామన్న తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల పంపిణీ

వజ్రకరూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, ఉన్నతస్థాయికి చేరుకోవాలని పులువురు వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల చెందిన 156 మంది విద్యార్థులకు పగడాల పెద్ద చలపతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు అందజేశారు. అనంతరం బదిలీపై పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు కౌసల్య, భాగ్యరేఖ, అరుణకుమారిని సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రంగప్రసాద్, సర్పంచ్ మోనాలిసా, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, చాబాల సర్పంచ్ మల్లెల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ రాయదుర్గం కార్యదర్శి కొ(్రీ)ష్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం రాయదుర్గంలో ధర్నా కరపత్రాలు విడుదల చేశారు. ఆర్‌బీకేల్లో ఖాళీగా ఉన్న అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ పోస్టులు, గ్రూప్ 1, 2 పోస్టులు భర్తీ చేయాలని, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, మెటీరియల్ అందజేయాలని డిమాండ్ చేశారు.

చోళసముద్రం వీఆర్వోగా గోపాల్

కూడేరు: మండల పరిధిలోని చోళసముద్రం వీఆర్వోగా గోపాల్‌ను ఉన్నతాధికారులు నియమించారు. బుధవారం ఆయన వీఆర్వోగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ వీఆర్వోగా పని చేసిన సురేంద్ర ఏడాది క్రితం సస్పెండ్ అయ్యారు. గోపాల్ బొమ్మనహాళ్ మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని వీఆర్వో గోపాల్ తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉండండి



మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మానాయక్

రాయదుర్గం రూరల్: వ్యవసాయాధికారులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఏడీఏ లక్ష్మానాయక్ ఆదేశించారు. మండలంలోని 74 ఉడేగోళం రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఐదు మండలాల వ్యవసాయాధికారులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన ఎరువులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.14వ విడత రైతు భరోసా కోసం పీఎం కిసాన్ ఈకేవైసీని పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు రాయదుర్గం మహేంద్ర, గుమ్మఘట్ట నిర్మల్ కుమార్, కణేకల్లు శ్రావణ్ కుమార్, బొమ్మనహాళ్ సాయికుమార్, డి.హీరేహాళ్ క్రిష్ణ కిషోర్ రెడ్డి తదితరులున్నారు.

నేడు బహిరంగ ప్రజావేదిక

రాయదుర్గం రూరల్: 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నేడు (గురువారం) బహిరంగ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొండయ్య తెలిపారు. 17వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా పనుల పరిశీలన అనంతరం గత నెల 28 నుంచి జూలై 4వ తేదీ వరకు ఆయా గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు బహిరంగ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- విప్ కాపు రామచంద్రారెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రా రెడ్డి

బొమ్మనహాళ్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని గోనేహాళ్ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పెత్తందార్ల పక్షాన పనిచేస్తుందన్నారు. జగనన్న ప్రభుత్వం పేద, బడుగు వర్గాల పక్షాన పనిచేస్తుందని వివరించారు. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో సంక్షేమ పథకాల నగదు జమ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్వేత, ఎంపీటీసీ వెంకట్‌స్వామి, రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాగిరెడ్డి, మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సీనియర్ నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటాక్షిపతిరెడ్డి, లోకేష్, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు పరమేశ్వర, వన్నల్లి రామాంజినేయులు, మనోహర్‌శెట్టి, రామకృష్ణ, ఆనంద్‌రెడ్డి, కృష్ణ, దేవన్న, దర్గన్న, ప్రకాష్‌రెడ్డి, రామకృష్ణ, ముక్కన్న, ఆంజినేయులు, కోటేశ్వరరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి గురైన పల్లెల అభివృద్ధి

దీర్ఘకాలంగా నిర్లక్ష్యానికి గురైన గ్రామాలను అభివృద్ధి చేసి నియోజకవర్గ రూపురేఖలు సమూలంగా మారుస్తున్నామని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం కళ్యాణదుర్గం-బళ్లారి ప్రధాన రహదారి నుంచి గొనూరు గ్రామానికి రూ.2.36 కోట్లతో 5 కిలోమీటర్లు వేసిన తారురోడ్డును విప్ కాపు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కాపు మాట్లాడుతూ టీడీపీ హయాంలో గొనూరు గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండేదన్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉండేదన్నారు. గొనూరు గ్రామస్తుల కోరిక మేరకు రూ.2.36 కోట్లతో 5 కిలోమీటర్ల తారురోడ్డు వేశామని తెలిపారు.

ఎస్.కొత్తపల్లిలో..

గుమ్మఘట్ట: ప్రజల సంక్షేమానికి జగనన్న సురక్ష కార్యక్రమం శ్రీరామరక్షలా మారిందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఇంటింటికీ వెళ్లారు. సంక్షేమ పథకాలు రాబోవు కాలంలో నిర్విరామంగా పొందాలంటే వచ్చే ఎన్నికల్లో జగనన్నను ఆదరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల తీర్పునకు టీడీపీ అధినేత చంద్రబాబుకు మైండ్ బ్లాక్ అయి దిమ్మతిరగడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సురేశ్‌బాబు, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీపీ భవాని, సర్పంచులు అనిల్, కోట్ల ఉమేష్, ఎంపీటీసీలు ఈరన్న,గోవింద, కాంట్రాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, కొత్తపల్లి రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, గొల్లవెంకటేశులు, ఉమేష్, నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, మారుతి, కలుగోడు గోవిందరెడ్డి, కెఎం రాజు, శ్రీపతి, రుద్రప్ప, డీలర్ మల్లేశ్, హనుమంతరాయుడు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని దేవరెడ్డిపల్లి గ్రామంలో ఇంటింటికీ కొళాయి కనెక్షన్ల పనులకు జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీపీ భవానితో కలిసి బుధవారం ఆయన ప్రారంభోత్సవం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.3.50 లక్షలతో సురక్షితమైన తాగునీటిని అందించేందుకు శ్రీకారం చుట్టినట్లు విప్ తెలిపారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ ప్రజల దాహార్తిని శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ద్వారా తీర్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఈరన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ప్రణీత, ఉమేష్,శివ,మారుతి, మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో అపూర్వ ఆదరణ



వృద్ధురాలికి పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

- ఇంటింటికీ తిరుగుతూ పథకాలు వివరించిన మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ(విడపనకల్లు): విడపనకల్లు మండల పరిధిలోని కరకముక్కల గ్రామంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఇంటింటికీ తిరుగుతూ పథకాల లబ్ధిని వివరించారు. ప్రతి గడపలో అపూర్వ ఆదరణ లభించింది. అంతకుముందు గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే విశ్వపై పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విశ్వ.. ప్రతి గడపకు వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాల ద్వారా ఎంతమేర లబ్ధి పొందారో చెబుతూ బుక్‌లెట్లు అందజేశారు. మహిళలు, రైతులతో పాటు గ్రామంలో అన్ని వర్గాల వారు మరోసారి జగనన్నే సీఎంగా గెలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ జె.రామాంజనేయరెడ్డి, వడ్డే వెంకటేష్, ఉపసర్పంచ్ ఆదిమల్లు, పాలాక్షిరెడ్డి, రామన్న, తిప్పేస్వామి, పురుషోత్తం, జేసీఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, సీవి శేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో 'జగనన్న సురక్ష'

రాయదుర్గం రూరల్: మండలంలోని పల్లేపల్లి, వేపరాల సచివాలయాల్లో నేడు (గురువారం) జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొండయ్య తెలిపారు. ఇప్పటికే మండల స్థాయి అధికారుల బృందం, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్షపై అవగాహన కల్పించారని తెలిపారు. ప్రజలకు అవసరమైన 11 రకాల ధృవీకరణ పత్రాల కోసం వినతులు స్వీకరించినట్లు తెలిపారు. ఆ సర్టిఫికెట్లను ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

నేడు కూడేరులో 'జగనన్న సురక్ష'

కూడేరు: కూడేరు సచివాలయం-1లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనగన్న సురక్ష సర్వేలో దరఖాస్తు చేసుకున్న వారికి ఉచితంగా సర్టిఫికెట్స్ అందజేస్తామన్నారు.

మలయనూరు, కరిగానిపల్లి సచివాలయాల్లో..

కుందుర్పి: మండలంలోని మలయనూరు-1, కరిగానిపల్లి సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటనాయుడు బుధవారం తెలిపారు. సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకున్న వారికి అక్కడికక్కడే అందిస్తామన్నారు.

నేడు గడేహోతురులో..

వజ్రకరూరు: మండల పరిధిలోని గడేహోతురులో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ కె.సురేంద్ర, గ్రామ సచివాలయ కన్వీనర్ కె.పార్వతి తెలిపారు. బుధవారం గ్రామంలో ఎంపీడీఓ విజయలలిత, తహసీల్దార్ అనిల్‌కుమార్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే విశ్వ హాజరై, సర్టిఫికెట్లను అందజేస్తారన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు



ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీసీహెచ్ఎస్ కృష్ణవేణి

ఉరవకొండ: ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని డీసీహెచ్ఎస్ కృష్ణవేణి హెచ్చరించారు. బుధవారం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఓపీ విభాగాన్ని పరిశీలించి వైద్యం కోసం వచ్చిన వారిని అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఆసుపత్రి ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ ఎల్లోజీతో కలిసి ల్యాబ్, మందుల గది, ఓపీ గదులను పరిశీలించారు. అనంతరం డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంతో మంది వైద్యం కోసం ఆదివారం కుడా వస్తుంటారని అలాంటి సమయంలో వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. అవసరమైన మందులు స్టాక్ ఉంచుకోవాలని రోగులకు బయట మందులు తెచ్చుకోమని సూచించరాదన్నారు. అనంతరం వైద్యుల అటెండెన్స్‌ను తనిఖీ చేశారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని మాజీ సర్పంచ్ రామేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి గృహం వద్ద పార్టీ మండల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సీపీ వీరన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళ్యాణదుర్గంలో ఈనెల 8వ తేదీన నిర్వహించనున్న రైతు దినోత్సవానికి మండలం నుంచి పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. రైతు సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న సీఎంకు మద్దతుగా రైతులందరూ తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, జెడ్పీటీసీ మమత, బెళుగుప్ప, ఆవులెన్నల సహకార సంఘాల అధ్యక్షులు శివలింగప్ప, శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్, మండల నాయకులు తిర్లోక్‌రెడ్డి, పాటిల్ నాగిరెడ్డి, మచ్చన్న, కేశవరెడ్డి, గోవిందరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.15.20 కోట్ల పంటల బీమా మంజూరు

కూడేరు: వైఎస్సార్ ఉచిత పంటల బీమా వర్తింపులో జిల్లాలో కూడేరు మండలానికి రెండో స్థానం దక్కింది. మొత్తం 10,007 మంది రైతులకు రూ.15,20,59,472 మంజూరైనట్లు ఏఓ విజయ కుమార్ బుధవారం విలేకరులకు తెలిపారు. పత్తికి రూ.889, చీనీ పంటకు రూ.12,470, వేరుశనగకు రూ.2,392లు చొప్పున బీమా పరిహారం మంజూరైందన్నారు. ఈనెల 8వ తేదీ తర్వాత రైతు ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని పేర్కొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

బొమ్మనహాళ్: విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ మల్లికార్జున అన్నారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం జగనన్న విద్యా కానుకలో భాగంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగు, బూట్లు, ఏక రూప దుస్తులు, బెల్టులను ప్రతి ఒక్క విద్యార్థికి అందేలా చూడాలన్నారు. బడి ఈడు పిల్లలు బడి బయట ఎవరూ లేకుండా ప్రతి ఒక్కరూ బడిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమయానికి పాఠశాలకు హాజరవ్వాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్లు శ్రీనివాస్‌రెడ్డి, రాజా సూర్యుడు, సీఆర్‌పీలు అమరేష్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలోకి సత్యసాయి కార్మికులు



నిరసన చేపడుతున్న సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు

కూడేరు: మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యాం వద్ద ఏర్పాటు చేసిన సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న కార్మికులు బుధవారం సమ్మెలోకి వెళ్లారు. తాగునీటి కార్మిక సంఘం నేతలు మాట్లాడుతూ.. గతంలో మాదిరి ప్రభుత్వమే 70 శాతం నిధులిచ్చి ప్రాజెక్ట్ నిర్వాహణ చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. 16 నెలల ఈఎస్ఐ, 7 నెలల పీఎఫ్, ఎల్‌అండ్‌టీ వారు ఇవ్వాల్సిన గ్రాట్యుటీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాగునీటి కార్మికులు తిప్పయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు టీకాలు

శెట్టూరు: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో గురువారం పెంపుడు కుక్కలకు టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి సాయి సుమంత్ ఓ ప్రకటనలో తెలిపారు. కుక్క కాటుతో రేబీస్ వ్యాధి సోకకుండా టీకా వేస్తామని, పెంపుడు కుక్కల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శభాష్ వలంటీర్



రేణుకమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శిరీష

రాయదుర్గంటౌన్: పింఛన్ పొందుతున్న ఓ వృద్ధురాలు అనారోగ్యంతో కర్ణాటకలోని హిరియూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అక్కడికే వెళ్లి నగదు అందజేసి ఓ వలంటీర్ పలువురితో శభాష్ అనిపించుకుంది. పట్టణంలోని 30వ వార్డు సిద్దేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న రేణుకమ్మ ప్రతి నెలా విడో పింఛన్ పొందుతోంది.15 రోజుల నుంచి హిరియూర్‌లోని కుమార్తె చంద్రకళ వద్ద ఉంటూ అక్కడ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకుని రేణుకమ్మకు పింఛన్ చేర్చాలనే ఉద్దేశంతో వార్డు కౌన్సిలర్ గోరంట్ల ఉష, వార్డు ఇన్‌చార్జ్ గోరంట్ల సత్యనారాయణ సహకారంతో శిరిష కర్ణాటకలోని హిరియూర్‌కు వెళ్లి రేణుకమ్మకు పింఛన్ డబ్బు అందజేసింది.

ఫెయిల్ విద్యార్థులకు రీ అడ్మిషన్



విద్యార్థులను పాఠశాలలో చేరుస్తున్న ఎంఈఓ, హెచ్ఎంలు

కణేకల్లు: టెన్త్ ఫెయిల్ అయిన ఐదుగురు విద్యార్థులకు కణేకల్లు ఎంఈఓలు లక్ష్మణ్ణ, భవానీశంకర్ రీ అడ్మిషన్ చేయించారు. మండలంలోని యర్రగుంట జెడ్పీ హైస్కూల్‌లో గతేడాది పదో తరగతి చదివిన విద్యార్థుల్లో గొల్ల వంశీ, సందీప్‌కుమార్, మహతేష్, అంజి, గొల్ల దివాకర్ ఫెయిల్ అయ్యారు. రీ అడ్మిషన్ అయిన విద్యార్థులకు అమ్మఒడి కూడా వర్తింప చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొనడంతో ఐదుగురికీ రీ అడ్మిషన్ చేయించారు. కార్యక్రమంలో సీఆర్పీలు రాజేష్, లక్ష్మీకాంతలు పాల్గొన్నారు.

భూముల వివరాలు సరి చేయండి

కణేకల్లు: మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ భూముల వివరాలు వెబ్ ల్యాండ్‌లో సరిగా లేవని తెలిపారు. సరి చేయాలని బుధవారం తహసీల్దార్ రజాక్ వలీని మండలకేంద్రంలో కలిసి విజ్ఞప్తి చేశారు. భూముల కొలతలు సరిగానే ఉన్నాయని తహసీల్దార్ తెలిపారు. అయితే రైతులందరూ కలిసి వస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ రజాక్‌వలీ వారికి హామీ ఇచ్చారు.

మాతా,శిశు మరణాలు తగ్గించండి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్

కళ్యాణదుర్గం: మాతా, శిశు మరణాలను తగ్గించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ సిబ్బందికి సూచించారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో మాట్లాడారు. చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని చెప్పారు. గర్భిణులు కూడా సరైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, కుష్టు నియంత్రణ అధికారి డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ సత్యప్రియ పాల్గొన్నారు.

ప్రజల వద్దకే 11 రకాల సేవలు



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న గౌని ఉపేంద్రా రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'జగనన్న సురక్ష' ద్వారా ప్రజల వద్దకే 11 రకాల సేవలు అందుతాయని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పేర్కొన్నారు. పట్టణంలోని 8, 9, 10వ సచివాలయాల పరిధిలోని ఆయా వార్డుల కౌన్సిలర్లు గౌని లావణ్య, బండి అజయ్, మల్లెపూల మమత అధ్యక్షతన బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముఖ్య అతిథులుగా హాజరైన గౌని ఉపేంద్రారెడ్డి, పొరాళ్ల శిల్ప మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ జల్లెడ పట్టి మరీ గుర్తించి సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. టీడీపీ నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాష, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, కొంతెం దేవరాజు, దేవపుత్ర, వార్డు ఇన్‌చార్జులు, మున్సిపల్ మేనేజర్ కిశోర్, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ న్యాయం..

శెట్టూరు: అర్హులందరికీ న్యాయం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ సోమనాథ రెడ్డి అన్నారు. బుధవారం చెర్లోపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి ధ్రువ పత్రాలు అందించారు. ఎంపీడీఓ మైథిలీ, ఈఓఆర్డీ రఘురామరావ్, సర్పంచ్ జ్యోతి, నాయకులు ఖసీం, ఆనందప్ప, సుధాకర్ రెడ్డి, సూరప్ప, రామలింగ, తిమ్మప్ప, వెంకటేశులు, నాగభూషణ, మల్లికార్జున పాల్గొన్నారు.

గ్రామదేవతలకు పూజలు



పూజలందుకొన్న దేవమ్మ, కొల్లాపురమ్మ

కణేకల్లు: కణేకల్లులో వెలసిన గ్రామదేవతలైన దేవమ్మ, కొల్లాపురమ్మలకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కలశాలతో మేళతాళాల నడుమ ఊరేగింపుగా వేదవతి హగిరి కెళ్లి అక్కడ గంగపూజ జరిపించారు. వేదవతి హగిరి నుంచి పవిత్రమైన గంగాజలాలను తీసుకొచ్చి ఆలయంలో గ్రామదేవతలకు శుద్ధి చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, మంగళారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం పూజలు చేశారు. అమ్మవారి పేరున వదిలిన దేవరపోతుకు కూడా పూజలు జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఆలయాభివృద్ధికి నిధులు

బొమ్మనహాళ్: మండలంలో శ్రీధరఘట్టలోని మారెమ్మ దేవి, గౌరమ్మ దేవి ఆలయాల పునరుద్ధరణ కోసం ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక నిధులను కేటాయించిందని ఎంపీపీ పద్మ, సర్పంచ్ యోగేశ్వరరెడ్డి తెలిపారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి గడప గపడకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శ్రీధరఘట్ట గ్రామంలో నిర్వహించిన సమయంలో ఆలయాలు దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు విన్నవించారన్నారు. స్పందించిన విప్ కాపు అధికారులతో మాట్లాడి ఒక్కో ఆలయానికి రూ.10 లక్షల వంతు మంజూరు చేయించినట్లు తెలిపారు.

తేలికపాటి వర్షం

కుందుర్పి: మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం నుంచి రాత్రంతా తేలిక పాటి వర్షం కురిసింది. దుక్కి దున్నేందుకు ఈవర్షం ఎంతో ఉపయోగకరమని రైతులు తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం రైతులకు 4,500 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలను ప్రభుత్వం పంపిణీ చేసింది. బహుళ పంటలకు సంబంధించి 10 క్వింటాళ్ల రాగులు, 6 క్వింటాళ్ల కొర్రలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి మహేష్ తెలిపారు.